సాక్షి
పార్వతీపురం మన్యం
శనివారం । 17 । ఫిబ్రవరి । 2024



భళా..భావి ఇంజినీర్లు..!

విద్యార్థులు తమ ఆలోచనలను ఆవిష్కరణలుగా మార్చారు. ఇంజినీరింగ్ ప్రాజెక్టులతో ఆకట్టుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. -IIలో



యల్లారమ్మ జాతర తేదీలు ఖరారు

ఉత్తరాంధ్రలో ప్రసిద్ధిగాంచిన జామి యల్లారమ్మ జాతరను మార్చి 16,17,18వ తేదీల్లో నిర్వహించనున్నారు. -IIలో

నేడు పదోన్నతుల కౌన్సెలింగ్

పార్వతీపురం: ప్రొవిజనల్ జాబితాలో పేర్లు ఉన్న ఉపాధ్యాయులు పదోన్నతుల కౌన్సెలింగ్ కోసం ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరానికి శనివారం హాజరుకావాలని ఐటీడీఏ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఎస్‌జీటీలు, సమాన కేటగిరీ ఉపాధ్యాయులకు పాఠశాల సహాయకులుగా పదోన్నతులు కల్పించే జాబితాను కార్యాలయ నోటీస్ బోర్డులో ఉంచామన్నారు.

న్యూస్‌రీల్

20న యువతకు ఉపన్యాస పోటీలు



వెంకట్ ఉజ్వల్

పార్వతీపురం: యువతకు ఉపన్యాస పోటీలను ఈ నెల 20న నిర్వహిస్తామని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వశాఖకు చెందిన నెహ్రూ యువకేంద్ర సంఘటన్ ఆదేశాల మేరకు వీటిని నిర్వహిస్తామన్నారు. న్యూఢిల్లీ పార్లమెంట్ భవనంలో జరిగే జాతీయ యూత్ ఫెస్టివల్–2024 కార్యక్రమంలో భాగంగా ప్రసంగించే అవకాశం కోసం ఉపన్యాస పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 18 నుంచి 25 ఏళ్ల వయస్సు ఉన్న యువతీ యువకులు పోటీల్లో పాల్గొనాలన్నారు. వికసిత్ భారత్, భారత్ మేకింగ్ ఇండియా, ఏ గ్లోబల్ లీడర్, ఎంపవరింగ్ ద ఫ్యూచర్ అనే అంశాలపై ఉపన్యాస పోటీలు ఉంటాయన్నారు. జిల్లాస్థాయి పోటీలు ఈ నెల 20న ఉదయం 10 గంటలకు వర్చువల్ మోడ్‌లో జరుగుతాయన్నారు. యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్: 7036485278 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రిజిస్ట్రేషన్ హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటుకు ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పార్వతీపురం: సచివాలయాలు వేదికగా సాగుతున్న పేదల ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్‌కు హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్‌రెడ్డి ఆదేశించారు. వివిధ ప్రాధాన్యత అంశాలపై జిల్లా కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్సులో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 29లోగా పేదల ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్లు పూర్తిచేయాలన్నారు. ఉపాధి హామీ పనుల వివరాలు, బిల్లులు ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు, డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి బి.వాగ్దేవి, డ్వామా పీడీ కె.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి పందిరి రాట



తూర్పు రాజగోపురం వద్ద పందిరిరాట వేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామివారి దేవస్థానంలో స్వామివారి కల్యాణోత్సవానికి అర్చకులు శ్రీకారం చుట్టారు. ఈ నెల 20న జరిగే కల్యాణంలో భాగంగా తూర్పురాజగోపురం వద్ద శాస్త్రోక్తంగా శుక్రవారం పందిరిరాట వేశారు. వేకువజామున సుప్రభాతసేవ, బాలభోగం అయిన తరువాత రామస్వామివారి సన్నిధిలో విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ క్షేత్ర పాలకులైన ఉమా సదాశివాలయంలో కూడా పందిరిరాట కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ 20న స్వామివారి కల్యాణోత్సవం, 21న పుష్పాభిషేకం, 23న రాత్రి 10 గంటలకు రథయాత్ర మహోత్సవం జరుగుతుందన్నారు. ఆనవాయితీ ప్రకారం సీతారామునిపేటకు చెందిన భక్తులు రథాన్ని నామస్మరణతో ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చారు. రథాన్ని శుభ్రంచేసి, రంగులు వేసి రథయాత్రకు సిద్ధం చేశారు.

రామతీర్థానికి రథసప్తమి శోభ

రథ సప్తమిని పురస్కరించుకొని రామతీర్థానికి భక్తులు పోటెత్తారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యంలో రామస్వామివారిని దర్శించుకున్నారు. ఉమాసదా శివుని ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరావు, అర్చకులు మల్లికార్జునశర్మ, సాయి రామాచార్యులు, కిరణ్ పాల్గొన్నారు.

బెల్లం దిగుబడి బాగుంది

రేగిడి: బెల్లం దిగుబడి ఈ ఏడాది బాగుందని డీఎస్‌ఓ ఎల్.వి.రామచంద్రరావు అన్నారు. ఖండ్యాం గ్రామంలో సూర్యనారాయణ అనే రైతు గానుగ ఆడుతున్న చెరకును శుక్రవారం పరిశీలించారు. ఒక టన్ను చెరకకు 98.670 కిలోల బెల్లం దిగుబడి వచ్చిందని తెలిపారు. మమ్ముచెరకు పంటపై అధ్యయనం చేస్తున్నామన్నారు. ఏఎస్‌ఓ ఏసుబాబు, వీఆర్‌ఓ జె.పట్టాభిరామ్, అగ్రికల్చర్ అసిస్టెంట్ టి.శైలజ, వీఆర్‌ఏ పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధే అజెండా

- కొత్తజిల్లాలో వికసిస్తున్న ప్రగతిపూలు
- వైద్య కళాశాల నిర్మాణానికి రూ.4.19 కోట్లతో టెండర్లకు ఆహ్వానం
- తాజాగా జిల్లాలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణానికి రూ.99.89 కోట్లు మంజూరు
- నిర్మాణ దశలో ఉన్న పార్వతీపురం, సీతంపేట మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రులు
- నెరవేరుతున్న మన్యంవాసుల కల

పార్వతీపురంటౌన్:

కొత్తగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రగతి పూలు వికసిస్తున్నాయి. జిల్లాకు కావాల్సిన సదుపాయాలు ఒక్కొక్కటిగా సమకూరుతున్నాయి. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషితో మన్యం వాసుల సమస్యలు పరిష్కారమవుతున్నాయి. ఏజెన్సీ ప్రజల కోరిక మేరకు ప్రభుత్వం ప్రత్యేక జిల్లాను కేటాయించింది. ఊరూరా సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్‌క్లినిక్‌లు ఏర్పాటుచేసి కొండ దిగకుండానే సేవలను అందిస్తోంది. కోట్లాది రూపాయల వ్యయంతో గిరిజన గూడలకు రోడ్లు నిర్మిస్తోంది. జిల్లాకు కొత్తగా వైద్యకళాశాలను మంజూరు చేసింది. పార్వతీపురం, సీతంపేటలలో మల్టీస్పెషాల్టీ ఆస్పత్రులను నిర్మిస్తోంది. గిరిజన ప్రజలకు నెట్‌వర్క్ సమస్యలను దూరంచేస్తూ కొండల్లో సెల్‌టవర్లు ఏర్పాటుచేస్తోంది. తాజాగా జిల్లా ప్రజలకు సేవలందించేందుకు వీలుగా కలెక్టరేట్ సముదాయం నిర్మాణానికి రూ.99కోట్లు కేటాయించింది. అభివృద్ధే అజెండాగా సాగుతున్న ప్రభుత్వ పనితీరుపై మన్యంవాసులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. అభివృద్ధిని స్వాగతిస్తున్నారు.

రూ.600 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు...

నాడు–నేడు కార్యక్రమం క్రింద జిల్లాలోని ఆస్పత్రులను అభివృద్ధి చేయడంతో పాటు జిల్లాలో కొత్తగా వైద్యకళాశాల నిర్మాణానికి రూ.600 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఏపీ వైద్యశాఖ డైరెక్టర్ పరిపాలన పరమైన అనుమతులను మంజూరూ చేస్తూ జీవో నంబర్ 301ను జారీ చేశారు.

జిల్లాలో ప్రభు త్వ వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాల, సిబ్బంది నివాసానికి అవసరమైన భవనాలు నిర్మించనున్నా రు. మెడికల్ కళాశాల నిర్మాణానికి ఈనెల 8 నుంచి టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 23 వర కు బిడ్డింగ్ చేసుకునే వెసులబాటు కల్పించారు.



సమీకృత కలెక్టరేట్ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ నిశాంత్ కుమార్, అధికారులు (ఫైల్)

రూ.99.90 కోట్లతో సమీకృత కలెక్టరేట్

అడ్డాపుశిలవద్ద సువిశాలమైన ప్రాంతంలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయం నిర్మాణానికి రూ.99.90 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయాలు నిర్మించాలని ప్రభుత్వ నిర్ణయించగా, తొలివిడతలో పార్వతీపురం మన్యం జిల్లాలో భవనాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వడం హర్షించదగ్గ పరిణామం.



PART I - NOTIFICATIONS BY GOVERNMENT, HEADS OF DEPARTMENTS AND OTHER OFFICERS

NOTIFICATIONS BY GOVERNMENT

మెడికల్ కళాశాలకు రూ.600కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం జారీచేసిన జీఓ

జిల్లాకు రెండు మల్టీస్పెషాల్టీ ఆస్పత్రులు

ఒకప్పుడు గిరిజన ప్రాంత ప్రజలు మెరుగైన వైద్యం కావాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. గిరిజనులెవరూ వైద్యం కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో జిల్లాకు రెండు మల్టీస్పెషాల్టీ ఆస్పత్రులను ప్రభుత్వం మంజూరు చేసింది.

గిరిజన గ్రామాలకు చేరువగా ఉన్న పార్వతీపురం, సీతంపేటలో (ఒక్కో ఆస్పత్రిని రూ.49.29 కోట్ల వ్యయంతో) రూ.98.58 కోట్లతో ఆస్పత్రులను నిర్మిస్తోంది.



మెడికల్ కళాశాల నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్, అధికారులు (ఫైల్)

ఉత్తర్వులు జారీ అయ్యాయి

సమీకృత కలెక్టర్ కార్యాలయ సముదాయం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం సంతోషకరం. అడ్డాపుశిల వద్ద 59.80 ఎకరాల భూమిని కేటాయించాం. భవన నిర్మాణ పనులు త్వరగా ప్రారంభమై, వేగవంతంగా పూర్తి కావాలని ఆకాంక్షిస్తున్నాం. మెడికల్ కళాశాల నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ ఈనెల 23వరకు కొనసాగుతుంది. అనంతరం మెడికల్ కళాశాల పనులు ప్రారంభిస్తాం.

– నిషాంత్ కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం జిల్లా

జిల్లాలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు ఇలా..	సమీకృత కలెక్టరేట్ నిర్మాణానికి	బోధనాస్పత్రి నిర్మాణానికి	బోధనాస్పత్రికి తొలి దశ టెండర్ల	సీతంపేట మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రి నిర్మాణానికి	పార్వతీపురం మల్టీస్పెషాల్టీ ఆస్పత్రి నిర్మాణానికి
	రూ. 99.90 కోట్లు	రూ. 600 కోట్లు	రూ. 4.19 కోట్లు	రూ. 49.29 కోట్లు	రూ. 49.29 కోట్లు

మాతాశిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పార్వతీపురంటౌన్: మాతాశిశు ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది, కిల్కారి పేరిట వాయిస్‌కాల్స్‌లో ఆరోగ్య జాగ్రత్తలు వినిపించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని రూపకల్పన చేసిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బి.జగన్నాథరావు అన్నారు. ఆశ నోడల్ అధికారులకు కిల్కారి మొబైల్ అకాడమీ(కేఎంఏ)పై వైద్య ఆరోగ్య కార్యాలయంలో శుక్రవారం శిక్షణ ఇచ్చారు. కేఎంఏ స్టేట్ ప్రోగ్రాం అధికారి ఎల్.రాజు, రీజనల్ ప్రోగ్రాం అధికారి ఆర్.మోహనరావు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జగన్నాథరావు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలను కిల్కారీ వాయిస్ కాల్స్ ద్వారా వివరిస్తారన్నారు. ఆర్సీహెచ్ పోర్టల్‌లో నమోదైన ప్రతి గర్భిణికి ఫోన్: 01244588000 నంబర్ నుంచి వాయిస్ కాల్ వస్తుందన్నారు. ఫోన్ లిఫ్ట్‌చేయకుంటే ఐవీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

సిస్టం ఆటోమేటిక్‌గా ఒకే రోజు మూడు సార్లు ఫోన్ కాల్ వచ్చేలా చేస్తుందన్నారు. మళ్లీ సందేశాన్ని వినాలనుకునేవారు 14423 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్‌చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్బీఎస్కే అధికారి డాక్టర్ డి.భాస్కరరావు, డీఐఓ డాక్టర్ నారాయణరావు, డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు, డీసీహెచ్ఎస్‌ఓ ఉషారాణి, డీఎస్‌ఓ శంకర్, డీపీఓ లీలారాణి, విజయ లక్ష్మి, ఆదిలక్ష్మి, జయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు వేదిక స్టెప్‌కాన్



సదస్సులో మాట్లాడుతున్న బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ శ్రీనివాసరావు

రాజాం సిటీ: విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణలకు వేదికగా స్టెప్‌కాన్ ఉపయోగపడుతుందని బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బీఏఆర్‌సీ) డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జీఎంఆర్ ఐటీలో స్టెప్‌కాన్ –2024ను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యమైన నూతన ఆవిష్కరణలు, సమగ్రత, చురుకుదనం అభివృద్ధి చేసుకోవాలని కోరారు. స్టెప్‌కాన్ లాంటి కార్యక్రమాల ద్వారా నూతన ఆవి ష్కరణలకు అవకాశం ఉంటుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని బీఏ ఆర్‌సీలో చేరాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. బార్క్, డీఏఈ కింద పనిచేస్తోందని, బ్యూరోక్రాట్ల కంటే సాంకేతిక నిపుణులతో నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఇది ప్రస్తుతం నీటి శుద్ధి, జీవశాస్త్రం, ఆహార సాంకేతికత రంగాలలో పనిచేస్తుందని తెలిపారు. బార్క్ ఎన్‌పీసీఐ కింద అణువిద్యుత్ ప్రాజెక్టును స్థాపించిందని, త్వరలో విశాఖపట్నంలో కొత్త శిక్షణ కేంద్రాన్ని, ఫ్యూజన్ రియాక్టర్‌ను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తోందని చెప్పా రు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్, జీఎంఆర్ వీఎఫ్ సీఈఓ ఎల్‌ఎం లక్ష్మణమూర్తి, డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, టీఎస్ కిషోర్, అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీల చించివేత

- మండిపడిన ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: గుమడాం సమీపంలో ఈ నెల 20న టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవానికి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ రానున్నారు. ఆయనకు స్వాగతం పలుకుతూ సాలూరు పట్టణంలో మక్కువ బైపాస్‌కు వెళ్లే దారిలో ఏర్పాటుచేసిన వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీను కొందరు ఆగంతకులు చించివేయడంపై ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజకీయంలో హుందాగా వ్యవహరించాలే తప్ప చిల్లర రాజకీయాలు తగవన్నారు. ఫ్లెక్సీలు చించేవారిపై చర్యలు తీసుకోవాలని పట్టణ, రూరల్ సీఐలు,



మక్కువ బైపాస్ రోడ్డులోని ఫ్లెక్సీని చించేశారిలా..

పోలీసులకు సూచించారు.

రామఫలాల సీజన్ ఆరంభం

- ఆశాజనకంగా దిగుబడి
- గుత్తులు లెక్కన విక్రయం
- ఒక్కోగుత్తిలో 20 నుంచి 40 వరకు ఫలాలు
- సైజును బట్టి రూ.120 నుంచి 150 మధ్య విక్రయం

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో రామఫలాల సీజన్ ఆరంభమైంది. కొండల్లో సేకరించిన రామఫలాలను గిరిజనులు గుత్తుల లెక్కన వారపు సంతలు, మార్కెట్లలో విక్రయిస్తున్నారు. ఒక్కో గుత్తిలో 20 నుంచి 40 వరకు రామఫలాలుండగా రూ.120 నుంచి రూ.150 వరకు ధర పలుకుతన్నాయి. వచ్చే నెలాఖరు వరకు ఫలాల సీజన్ ఉంటుంది. రామానగరం, దేవనాపురం గూడలు, అక్కన్నగూడ, రాజన్నగూడ, మొగదార, కారెం కొత్తగూడ తదితర ప్రాంతాల గిరిజన రైతులు సోమవారం జరిగే సీతంపేట సంతలోను, కుశిమి, కోడిశ, శంభాం ప్రాంత వాసులు కుశిమిసంతలో(శనివారం)ను, మర్రిపాడు, పూతికవలస, చిన్నబగ్గ, కీసరజోడు పంచాయతీ వాసులు బుధవారం మర్రిపాడులో జరిగే సంతలో విక్రయిస్తున్నారు. గిరిజనుల వద్ద కొనుగోలుచేసిన ఒక్కో గుత్తి రామఫలాలు మైదాన ప్రాంతాల్లో రూ.400ల వరకు విక్రయిస్తామని వ్యాపారులు చెబుతున్నారు. పెట్టుబడులు లేకుండా, కొం



రామఫలాలు లోడ్ చేస్తున్న వ్యాపారులు

డపోడులో లభించే రామఫలాలతో మంచి ఆదాయం సమకూరుతుండడంతో గిరిజన రైతులు సంతోషపడుతున్నారు.



విక్రయానికి మార్కెట్‌కు తీసుకువచ్చిన గిరిజనులు

సేకరణ కష్టమే..



కొండపోడు వ్యవసాయంలో పండే రామఫలాల సేకరణ కష్టమే. ఎంతకాలం నిల్వ ఉండవు. మైదాన వ్యాపారులకు పండ్లను విక్రయిస్తున్నాం.

– ఎస్.తోటయ్య, గొయ్యిగూడ

పంట దిగుబడి బాగుంది



ఈ సీజన్‌లో పంట దిగుబడి బాగుంది. అంతగా పెట్టుబడులు అవసరం లేదు. సీజన్ ఆరంభంలో ధరలు బాగున్నాయి.

– ఎస్.బంగారయ్య, కొత్తగూడ



ఆలయ ముఖద్వారం

గోవిందుడి కల్యాణం చూతము రారండి..!

- ఫిబ్రవరి 20న తోటపల్లిలో నిర్వహణ
- ఉత్తరాంధ్రుల ఇలవేల్పు వేంకటేశ్వర స్వామి

గరుగుబిల్లి:

ఉత్తరాంధ్ర ప్రాంతంలో చినతిరుపతిగా పేరుగాంచిన తోటపల్లిలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం భక్తులకు కొంగుబంగారంగా నిలుస్తోంది. పవిత్ర నాగావళి నదీ తీరంలో వెలసిన ఐదు దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లను దర్శించుకునేందుకు పార్వతీపురం, విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం తదితర జిల్లాలతో పాటు ఒడిశా రాష్ట్రం నుంచి వేలాది మంది భక్తులు నిత్యంవచ్చి తమ మొక్కులను తీర్చుకుంటారు.

20న కల్యాణం

మాఘశుద్ధ ఏకాదశి సందర్భంగా ఫిబ్రవరి 20న మంగళవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి తోటపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. వీరఘట్టానికి చెందిన ప్రముఖయజ్ఞికర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ పర్యవేక్షణలో సత్తె నరసింహాచార్యులు, అప్పలాచార్యులు కల్యాణ మహోత్సవాన్ని వేద మంత్రోచ్చారణలతో జరిపిస్తారు. ఈ మేరకు కల్యాణానికి సంబంధించిన ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. కల్యాణ మహోత్సవం అనంతరంఫిబ్రవరి 24న పవిత్ర నాగావళినదిలో స్వామివారికి శ్రీచూర్ణోత్సవం శ్రీచక్ర తీర్థస్నానం నిర్వహించడం వివాహ వేడుక పూర్తి చేస్తారు. స్వామివారి కల్యాణంలో పాల్గొనే భక్తులు రూ. 500 చెల్లించి తమ గోత్రనామాలతో పూజలు చేయించుకోవాలని కమిటీ సభ్యులు కోరారు. ఉత్సవాలలో భాగంగా కుసుమూరు సాగర్ ఆధ్వర్యంలో శ్రీ లీలా పార్వతి నాదస్వరం పార్టీతో దక్షిణాది సన్నాయి బృందం నాదస్వరం కచేరీ నిర్వహించనున్నారు. భక్తులు, దాతల సహకారాలతో కల్యాణం జరుగుతుందని ఈఓ సూర్యనారాయణ కోరారు.



పుట్టుదేవుడు (చెన్నకేశవస్వామి)

ఆలయ చరిత్ర

పార్వతీపురం–శ్రీకాకుళం ప్రధాన రహదారి పరిధిలో గల తోటపల్లివద్ద 1969లో జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ ప్రైవేట్ బస్సులోయలో పడింది. ఆ బస్సును వెలికితీసే ప్రయత్నంలో పొదలు, డొంకలు, చెట్లు తొలగిస్తుండగా రెండున్నర అడుగుల శ్రీ చెన్నకేశవ స్వామి శిలావిగ్రహం బయటపడింది. ఈ నేపథ్యంలో స్థానికులు విగ్రహానికి గుర్తించి తాత్కాలికంగా కొమ్మలతో పందిరి ఏర్పాటుచేసి అందులో విగ్రహాన్ని ఉంచి పూజలు చేశారు. అక్కడే చందాలకోసం ఒక హుండీని ఏర్పాటుచేసి భక్తుల నుంచి విరాళాలను సేకరించారు. రానురాను భక్తుల విరాళాలు ఎక్కువకావడంతో ఆలయ నిర్మాణానికి ఆలోచన చేశారు. దీనికోసం అప్పటి పార్లమెంటుసభ్యుడు విశ్వాసరాయ నరసింహారావు ''మేలుకొలుపు'' అనే కరపత్రాన్ని ప్రచురించి వీరఘట్టానికి చెందిన డాక్టర్ నల్లాన సాంబశివరావు అధ్యక్షతన 40మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఆలయనిర్మాణానికి తోటపల్లి గ్రామానికి చెం



కల్యాణంలో స్వామివారి ఉత్సవమూర్తులు

దిన మార్కొండ కుటుంబీకులు స్థలాన్ని ఉచితంగా ఇవ్వగా పలువురు దాతలు ముందుకువచ్చి విరాళాలు అందజేశారు. దీంతో ఆగమశాస్త్రం ప్రకారం తోటపల్లిలోని నాగావళి నది ఒడ్డున శ్రీవేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్ల ఆలయాలను నిర్మించారు. రోడ్డు ప్రమాదంలో లభించిన శ్రీచెన్నకేశవస్వామి విగ్రహానికి పలుచోట్ల గాట్లు ఏర్పడడంతో ఆ విగ్రహమే నేడు పుట్టుదేవుడిగా భక్తులనుంచి పూజలు అందుకుంటోంది. విజయవాడలోని శిల్పశాలనుంచి పద్మావతి, వేంకటేశ్వరస్వామి విగ్రహాలను తెప్పించి 1972లో ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

క్లుప్తంగా

జాతీయ సదస్సుకు రంగనాథం


గార రంగనాథం

రాజాం సిటీ: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న విజయవాడలో జరగనున్న జాతీయ సదస్సుకు రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు గార రంగనాథం హాజరుకానున్నారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'మాతృభాష ప్రాధాన్యం' అనే అంశంపై కేంద్రసాహిత్య అకాడమీ, ఆంధ్ర లయోలా కళాశాల సంయుక్తంగా నిర్వహించనున్న ఒక రోజు సదస్సుకు తనకు ఆహ్వానం అందిందని చెప్పారు. ఈ సదస్సులో తెలుగుతో పాటు కన్నడ, మలయాళం, బంజారా, తుళు, బడగ, కోలామి, ముల్లుక్కురువ, గోండు వంటి భాషల సాహితీవేత్తలు కూడా పాల్గొంటారని తెలిపారు. ఈ సదస్సులో నాలుగు సమావేశాలు ఉంటాయని, మూడు, నాలుగు సమావేశాల్లో కవితా పఠనం ఉంటుందని, మూడవ సమావేశంలో తాను కవిత్వం పఠిస్తానని వెల్లడించారు.

బైక్‌పై నుంచి జారిపడి గిరిజన మహిళ మృతి


సిరంగమ్మ (ఫైల్)

సీతంపేట: మండలంలోని మండ గ్రామానికి చెందిన గిరిజన మహిళ సవర సిరంగమ్మ (35) ద్విచక్రవాహనంపైనుంచి జారిపడి శుక్రవారం మృతి చెందింది. ఆమె స్వగ్రామం నుంచి సీతంపేటకు బైక్‌పై వెనుక కూర్చుని వస్తుండగా మార్గమధ్యంలో టీటీడీ గుడి సమీపంలో మెయిన్ రహదారిపై స్పీడ్‌బ్రేకర్ వద్ద జారిపడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి భర్త బాలెమ్మ, కుమార్తె గౌరి, కుమారుడు గిరి ఉన్నారు. సిరంగమ్మ మృతితో గుండెలవిసేలా కుటుంబసభ్యులు రోదిస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఏఎస్సై సంజీవ్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి దుర్మరణం

- మరో ముగ్గురికి గాయాలు


జయశంకర్ మృతదేహం

కురుపాం: మండలంలోని గుంజరాడ జంక్షన్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదంపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నీలకంఠాపురం గ్రామానికి చెందిన సీమల జయశంకర్(41) లేవిడి గ్రామం నుంచి తన సొంతూరుకు బైక్‌పై వెళ్తుండగా మొండెంఖల్ నుంచి ఎదురుగా వస్తున్న మరో బైక్ బలంగా ఢీకొట్టడంతో జయశంకర్ రోడ్డుపై పడిపోగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అదే వాహనంపై వెనుక కూర్చున్న నీలకంఠాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలు అడ్డాకుల చామంతికి కూడా తీవ్ర గాయాలు కావడంతో భద్రగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్య సేవల కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వేరే ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరు వ్యక్తులకు స్వల్పగాయాలు కావడంతో భద్రగిరి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడు జయశంకర్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. నీలకంఠాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో మరో వ్యక్తి..


గురయ్య సందం బిజిలి మృతదేహం

కొమరాడ: మండలంలోని ఎగువ గంగరేగువలస గ్రామంలో నాగావళి నదిని అనుకుని ఉన్న ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌లో ఒడిశాకు చెందిన కూలీ విద్యుత్ షాక్ తగిలి శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై నీలకంఠ తెలిపారు. ఈ మేరకు స్థానికులు, పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి రియల్ ఎస్టేట్ నిర్మాణ పనుల్లో భాగంగా ఓ బోర్డును తయారు చేసి ఇద్దరు వ్యక్తులు బైక్‌పై తీసుకుని వెళ్తుండగా బోర్డుపైన ఉన్న ఇనుప రాడ్ విద్యుత్ వైర్లకు తగలడంతో బోర్డు పట్టుకున్న గురయ్య సుందం బిజిలి(36) అక్కడికక్కడే మృతిచెందాడు. అదృష్టవశాత్తు బైక్ నడుపుతున్న వ్యక్తి బయట పడ్డాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలకంఠం తెలిపారు పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించామన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹135	₹240	₹250

భళా..భావి ఇంజినీర్లు..!

- ఆకట్టుకున్న ఇన్‌స్పైర్ రాష్ట్రస్థాయి పోటీల నమూనాలు

విజయనగరం అర్బన్:

యువత నుంచి వచ్చే నూతన ఆవిష్కరణతోనే సాంకేతిక అభివృద్ధి సాధ్యం. అందుకు పాఠశాల విద్య నుంచి అడుగుపడాలి. పిల్లల్లో కొత్త ఆలోచనలు రేకెత్తాలన్నా..ప్రయోగాలపై ఆసక్తి మళ్లాలన్నా..ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్య స్థాయి నుంచే ప్రయోగబోధన అవసరం. ఈ నేపథ్యంలోనే పాఠశాలలు మొదలుకుని ఉన్నత విద్యా బోధన వరకు పరిశోధనాదృక్పథాన్ని విద్యార్థుల్లో కలిగించే ప్రయోగ ఆధారిత కృత్యాధార బోధనను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా ఎప్పటికప్పుడు వివిధ స్థాయిల్లో ప్రభుత్వం విద్య వైజ్ఞానిక ప్రదర్శన పోటీలను నిర్వహిస్తోంది. తాజాగా నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎస్‌సీఈఆర్టీ, పాఠశాల విద్య సంయుక్తగా జాతీయ, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలలో పాల్గొనేందుకు జిల్లా స్థాయి 15 ప్రాజెక్టుల ఎంపిక పూర్తయింది. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆ ప్రాజెక్ట్ నమూనాలు విజేతలుగా నిలవడానికి విద్యార్థులకు సంబంధిత గైడ్ ఉపాధ్యాయులు తర్ఫీదు ఇస్తున్నారు. కొన్ని నమూనాల వివరాలిలా ఉన్నాయి.

ప్రాజెక్ట్: ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ జీవసంచులు


ప్రాజెక్ట్ ప్రదర్శనలో పూజిత

రూపకర్త: జి.పూజిత, ఎంజేపీఏపీ బీసీ వెల్ఫేర్ గరల్స్ స్కూల్, కొత్తవలస, గైడ్ టీచర్: జి.ఇంద్రజ
తయారీ విధానం: అరటి కాండపు దవ్వను చిన్న చిన్న ముక్కలుగా తీసుకుని తగినంత నీళ్లుపోసి దానికి సోడియం కార్బొనేట్ కలిపి బాయిల్ చేయాలి. బాయిల్ అయిన ఈ ముక్కలను గ్రైండ్ చేసి, వచ్చిన పేస్ట్‌ని ఒక పొరలా పరిచి ఎండలో 12–40 గంటల ఆరనివ్వాలి. ఆరిన ఆ లేయర్లను తీసుకుని నచ్చిన సైజ్‌లో బ్యాగ్‌ను స్టిచ్ చేయాలి.
ప్రయోజనాలు: కాలుష్య రహితంగా ఉంటుంది. పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుంది. తక్కువ ఖర్చుతో తయారీ. రైతులకు అదనపు ఆదాయం లభిస్తుంది. కాలుష్య కారకాలైన ప్లాస్టిక్ బ్యాగ్ వినియోగాన్ని తగ్గించి సమాజానికి మేలు చేకూరుస్తుంది.

ప్రాజెక్ట్ పేరు: 'ఉమెన్ సేఫ్టీ బ్యాగ్'


ప్రాజెక్ట్ ప్రదర్శనలో మరడ నవ్య, బాడంగి

రూపకర్త: మరడ నవ్య, 10వ తరగతి, కేజీబీవీ బాడంగి
గైడ్ టీచర్: పెంకి సుభాషిణి
కావాల్సిన పరికరాలు: హ్యాండ్ బ్యాగ్, జీపీఎస్ సెన్సార్, 12వీ బ్యాటరీ, తీగలు
పనిచేయు విధానం: మొదటిగా బ్యాగు తీసుకుని అందులో లోపలి వైపు క్లాత్‌ను కొద్దిగా తొలగించి జీపీఎస్ సెన్సార్‌ను అమర్చుతారు. ఇది సిమ్‌కార్డు కలిగి ఉంటుంది. కనుక ఎక్కడ ఉన్నదీ లోకేషన్‌ను తెలియజేస్తుంది.
ఉపయోగాలు: బ్యాగులోపల ఉంటుంది కనుక ఇది ఉన్న సంగతి తెలియదు. బయటకు వెళ్లే ఆడవారు, పిల్లల లోకేషన్ ట్రేస్ చేయడం ద్వారా సకాలంలో సాయం అందించవచ్చు.

ప్రాజెక్ట్: ఇంటెలిజెంట్ ఐ


ప్రాజెక్ట్ ప్రదర్శనలో టి.విహాన్, ఫోర్ట్‌సిటీ స్కూల్

రూపకర్త: టి.విహాన్, ఫోర్ట్ సిటీ స్కూల్, విజయనగరం.
కావలసిన పరికరాలు
అల్ట్రాసోనిక్ సెన్సర్, బజర్, జంపర్ కేబుల్స్, బ్యాటరీ, జీపీఎస్, జీఎస్‌ఎం మాడ్యూల్
పనిచేసే విధానం: ఇది దృష్టి లోపం ఉన్నవారి కోసం. స్మార్ట్‌గా ఉండి ధరించగలిగే పరికరం. దృష్టి లోపం ఉన్నవారు తమను తాము సులభంగా, ఆత్మ విశ్వాసంతో నావిగేట్ చేయడానికి సహాయపడుతుంది. ఇది అడ్డంకిని గుర్తించి, బజర్, వైబ్రేటర్ మోటార్ల ద్వారా వ్యక్తిని అలారం చేస్తుంది. అడ్డంకి కలిగిన దూరం ఆధారంగా వైబ్రేషన్ రేటు పెరగడం లేదా తగ్గుతుంది.

ప్రాజెక్ట్ పేరు: హౌ గెట్ రెడీ ఫర్ ఎల్లో ఫ్యూయిల్ విత్ మల్టీపర్పస్ స్టవ్


ప్రాజెక్ట్ ప్రదర్శనలో షేక్ షహీదా, నెల్లిమర్ల

రూపకర్త: షేక్ షహీదా, ఎంజేపీ ఏపీ బీసీ వెల్ఫేర్ గురుకుల బాలికల పాఠశాల/జూనియర్ కళాశాల, నెల్లిమర్ల
తయారీ విధానం: ఈ స్టవ్‌లో ఇంధనంగా అరటి పిడకలను ఉపయోగించడం వల్ల వాతావరణంలో సీఓ2 శాతాన్ని, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చు. స్టవ్ గోడలు ట్యాంకు రూపంలో ఉంటాయి. అందులో మంచి నీరు వేస్తే వేడెక్కి, వంటతో పాటు స్టవ్‌కి అమర్చిన రాగి గొట్టం ద్వారా శుద్ధ జలాన్ని పొందవచ్చు.

ప్రాజెక్ట్ పేరు: మస్కిటో ట్రాపింగ్ మెషీన్


ప్రాజెక్ట్ ప్రదర్శనలో నెల్లి కార్తీక్ కుమార్, ఎ.ఆముదాలవలస

రూపకర్త: నెల్లి కార్తీక్ కుమార్, కొణిశి, జెడ్పీహెచ్‌స్కూల్, ఎ.ఆముదాలవలస
మలేరియా, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులను దోమలు కలిగిస్తాయి. దోమలు చంపే యంత్రం అతినీల లోహిత కాంతిని విడుదల చేస్తుంది. దాని మెటల్ గ్రిడ్ అధిక ఓల్టేజ్ విద్యుత్‌ను విడుదల చేస్తుంది. దీని వల్ల దోమలను తక్షణమే చంపుతుంది.
ప్రయోజనం: కాంతిని ఆకర్షించడం, తిరిగే ఫ్యాన్‌తో దోమలను ఆకర్షించి, వాటిని ఫ్యాన్ ద్వారా లోపలికి పీలుస్తుంది. ఎటువంటి రసాయన ప్రతిచర్యలు లేని సాధారణ పరికరం.

వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఆపతరమా...!

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర,ఎమ్మెల్యే శంబంగి


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పి.రాజన్నదొర, పక్కన ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: టీడీపీ, జనసేనలు ఎన్ని కుట్రలు పన్నినా, విమర్శలు చేసినా, ఎన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకున్నా రానున్న ఎన్నికల్లో వైఎస్‌ఆర్‌సీపీ ప్రభంజనాన్ని ఎవరూ అడ్డుకోలేరని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు ఆయన, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు శుక్రవారం ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు టీడీపీ అధికారంలో ఉండడంతో పాటు నారా లోకేష్‌కు మూడు మంత్రి పదవులు ఉండేవని ఆ కాలంలో ఎక్కెడెక్కడ, ఎన్ని కోట్లతో అభివృద్ధి పనులు చేశారు? ఎన్ని కోట్లతో సంక్షేమ పథకాలు అందజేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. తామే రాష్ట్ర ప్రజల భవిష్యత్‌కు గ్యారంటీ అని తిరుగుతున్నారని, జైలులో ఉండి ఇంకొకరి ష్యూరిటీపై బయటకు వచ్చిన చంద్రబాబు ప్రజల భవిష్యత్‌కు ఏమి గ్యారంటీ ఇవ్వగలరని విమర్శించారు.

ఆరు గ్యారంటీల అమలు ఎలా?

2014లో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన వారు ఇప్పుడు కూడా మోసపూరిత హామీలు ఇస్తూ ఊరూరా తిరుగుతున్నారని దుయ్యబట్టారు. ప్రస్తుతం అన్ని సంక్షేమ పథకాల అమలుకు ఏడాదికి రూ.80 వేల కోట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెచ్చిస్తున్నారన్నారని విమర్శలు చేస్తున్న చంద్రబాబు, లోకేష్‌లు వారు అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని చెప్పుకుంటూ తిరుగుతున్నారని,ఈ ఆరు గ్యారంటీ పథకాలకు ఏటా రూ.72 వేల కోట్లు, వాటితో పాటు తప్పని సరిగా ఇవ్వాల్సిన పథకాలకు రూ.52 వేల కోట్లు మొత్తం రూ.లక్షా 24 వేల కోట్లు ఖర్చు అవుతుందని, ఈ నిధులు ఎక్కడి నుంచి ఎలా తెస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో అధికారంలోకి రావడానికి అనేక అబద్ధపు హామీలిచ్చారని, డ్వాక్రా మహిళలు, రైతన్నలకు రుణమాఫీ చేస్తానని అబద్ధాలాడిన చంద్రబాబు అప్పటికి రుణాలు రూ.87,700 కోట్లు ఉండగా కనీసం రూ.15 వేల కోట్లు కూడా తీర్చలేదన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో 2లక్షల ఉద్యోగ నియామకాలు

అలాగే బాబు వస్తే జాబు వస్తుందని చెప్పారు కానీ కుమారుడు లోకేష్‌కు మాత్రమే జాబు ఇచ్చుకున్నారన్నారు. 2019లో వైఎస్‌ఆర్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొదటి దఫాగా 14,219టీచర్ పోస్టులు తీయగా ఇప్పుడు మరో 6,100 పోస్టులు తీయనున్నారని చెప్పారు. అలాగే ఫారెస్టు శాఖలో 689, వైద్యారోగ్యశాఖలో 60 వేలకు పైబడి పోస్టులు తీశారన్నారు. రెగ్యులర్ ఉద్యోగాలతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ తదితర పోస్టులు ఈ ఐదేళ్లలో 2 లక్షలకు పైబడి ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. టీడీపీ మాటలు నమ్మి వారికి ఓటేస్తే ఇప్పుడున్న సంక్షేమ పథకాలు ఒక్కటి కూడా రావని, సచివాలయాల్లో జన్మభూమి కమిటీ సభ్యుల అరాచకాలు సాగుతాయని చెప్పారు. మన భవిష్యత్ బాగుండాలన్నా. ఇప్పటి సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా సంక్షేమ సారథి జగన్‌నే మళ్లీ సీఎం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు పత్తిగుళ్ల ఏక్‌నాథ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కటికి చిన్నారావు, కనిమెరక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

60 మద్యం బాటిల్స్ స్వాధీనం

సంతకవిటి: మండల పరిధిలోని బొద్దూరు గ్రామంలో శుక్రవారం అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి 60 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ శంకర్ తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం తరలించినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అవనాంలో 14 మద్యం సీసాలు

భోగాపురం: మండలంలోని అవనాం జంక్షన్ వద్ద సీఐ రవికుమార్ సిబ్బందితో కలిసి శుక్రవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న రావాడ గ్రామానికి చెందిన బుత్తల పైడిరాజును అదుపులోకి తీసుకుని 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

- ట్రాఫిక్ సీఐ రంగనాథ్

విజయనగరం క్రైమ్: మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ రంగనాథ్ అన్నారు. పట్టణంలోని పలు ప్రధాన కూడళ్ల వద్ద శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలు నడుపుతున్న 17 మంది మైనర్లను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైలు లోవరాజు, శంబాన రవి, ఏఎం.రాజు, త్రినాథ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

విజయనగరం టౌన్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ప్రముఖ సాహితీవేత్త, అవధాని డాక్టర్ కట్టమూరి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం స్థానిక లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో పైడిమాంబ కళానికేతన్ ఆధ్యాత్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో పైడితల్లికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏప్రిల్ నెలలో నిర్వహించబోయే సంస్థ వార్షికోత్సవానికి సంబంధించి చేపట్టాల్సిన అంశాలపై సభ్యులతో చర్చించామన్నారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.సూర్యపాత్రో, పెద్దింటి అప్పారావు, ధవళ సర్వేశ్వరరావు, బొత్స బాబ్జీ, పీవీవీఎస్ భానురాజా, పాకలపాటి రమణమ్మ, సామవేదుల గీతారాణి, ఏడిద వీర్రాజు పాల్గొన్నారు.

యల్లారమ్మ జాతర తేదీలు ఖరారు

- మార్చి 16 నుంచి మూడురోజులు నిర్వహణ
- వివరాలు వెల్లడించిన ఎండోమెంట్ అధికారులు


యల్లారమ్మ అమ్మవారు

జామి: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధిగాంచిన జామి యల్లారమ్మ జాతరను మార్చి 16,17,18వ తేదీల్లో నిర్వహించనున్నట్లు పాలకులు, ఎండోమెంట్ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఎండోమెంట్ అధికారులు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో వేదపండితుడు మావూడూరి భాను మూర్తి జాతర మూహూర్తాన్ని ఖరారు చేశారు. స్థానిక మూడు కోవెళ్లలో గ్రామపెద్దలు, పాలకులు, ఎండోమెంట్ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు సమావేశమై మూహూర్తం ఖరారు చేశారు. మార్చి 16 తొలేళ్లు,17న జాతర, 18న చిన్నతీర్థం నిర్వహించడానికి ఖరారు చేశారు. తొలేళ్ల రోజు రాత్రి అమ్మవారిని 8.50 గంటలకు గద్దె దింపి రాత్రి 2.30గంటలకు ఆలయప్రవేశం జరిపించడానికి నిర్ణయించారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఈఓ ఎం.ప్రసాదరావు, సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, ఉప సర్పంచ్ అల్లు పద్మ, వాక అప్పారావు, వర్రి రమణ, ఎర్రిబాబు, చుక్క రామకృష్ణ, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.


యల్లరమ్మ జాతర ముహూర్తం పత్రాన్ని అందుకుంటున్న పాలకులు, పెద్దలు, అధికారులు

ఉంగరాడలో చోరీ

రేగిడి: మండలంలోని ఉంగరాడ గ్రామంలో ఓ ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగి బంగారు ఆభరణాలు, నగదు పోయియి. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తమ ఇంట్లో చోరీ జరిగి బంగారు ఆభరణాలు పోయినట్లు గ్రామానికి చెందిన బోటు నాగరాజు పోలీసులకు ఫిర్యాదుచేశాడు. నాగరాజు ఈనెల 13న కుటుంబంతో సహా తన సోదరుడి గృహప్రవేశానికి శ్రీకాకుళం వెళ్లాడు. 15వ తేదీవరకూ అక్కడే ఉన్నాడు. 15వ తేదీ రాత్రి వీధిలోని ఓ వ్యక్తి మేడపైన తలుపులు తీసి ఉన్నాయని సమాచారం ఇవ్వడంతో నాగరాజు వెంటనే తన బంధువులకు సమాచారం ఇచ్చి, ఇంటికి వెళ్లి ఆరాతీయమని చెప్పాడు. వారు వచ్చి ఇంటి తలుపులు తీసి చూడగా బట్టలు చెల్లాచెదురుగా పడి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి నాగరాజుకు సమాచారం చేరవేయడంతో వెంటనే ఇంటికి చేరుకుని చోరీ విషయంపై పోలీసులకు నాగరాజు ఫిర్యాదు చేశాడు. రెండున్నర తులాల బంగారంతో పాటు నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. వెంటనే రంగంలోకి దిగిన రేగిడి ఎస్సై ఇ.శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధితుడి వద్ద వివరాలు సేకరించారు. క్లూస్ టీంను రప్పించి పరిసరాలను పరిశీలించారు. విషయం తెలుసుకున్న ట్రైనీ డీఎస్పీ ఎస్.మహేంద్ర, సీఐ శ్రీనివాసరావులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

రంజీ మ్యాచ్‌లో ఆంధ్రా శుభారంభం

- మొదటి ఇన్నింగ్స్ 260/7
- రాణించిన మహీప్‌కుమార్, రిక్కీబుయ్‌లు


కెప్టెన్ రిక్కీబుయ్


మహీప్‌కుమార్

విజయనగరం: ఆంధ్రా బ్యాట్స్‌మెన్ మహీప్‌కుమార్ 157 బంతుల్లో 12 ఫోర్లతో 81 పరుగులు, కెప్టెన్ రిక్కీబుయ్ 133 బంతుల్లో 21 ఫోర్లతో 79 నాటౌట్‌గా రాణించడంతో కేరళ జట్టుతో ప్రారంభమైన రంజీ మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు శుభారంభం చేసింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సారథ్యంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ నేతృత్వంలో డెంకాడ మండలంలోని చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో శుక్రవారం ఆంధ్ర–కేరళ జట్ల రంజీ మ్యాచ్ ప్రారంభమైంది. టెస్ట్ మ్యాచ్ తరహాలో నాలుగు రోజుల పాటు సాగే రెండు ఇన్నింగ్స్‌ల మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆంధ్ర జట్టు ముందుగా బ్యాటింగ్ ప్రారంభించి..మొదటి రోజు ఆటముగిసే సమయానికి 89.3 ఓవర్లలో 7 వికెట్లు నష్టపోయి 260 పరుగులు చేసింది. బ్యాటింగ్‌లో మహీప్‌కుమార్ 81, కరణ్ షిండే 43, అశ్విన్ హెబ్బార్ 28, విహారి 24 పరుగులతో రాణించారు. కెప్టెన్ రిక్కీబుయ్ 133 బంతుల్లో 21 ఫోర్లతో 79 పరుగులు చేసి నాటౌట్‌గా కొనసాగుతున్నాడు. బౌలింగ్‌లో కేరళ క్రీడాకారులు బిశాల్ తంపి, వైశాక్‌చంద్రన్‌లు రెండేసి వికెట్లు దక్కించుకున్నారు.

18న జిల్లా సబ్ జూనియర్స్ కబడ్డీ జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సబ్‌జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపికపోటీలు ఈ నెల 18వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రంగారావుదొర, కేవీ ప్రభావతిలు శుక్రవారం తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి విజయనగరం సిటీ క్లబ్ ఆవరణలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొన దలచిన వారు 2008 మార్చి 18వ తేదీ తరువాత జన్మించి 55 కేజీల బరువులోపు ఉండాలన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు విధిగా ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీకాలపై ఫోకస్..

- ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ ఇస్తున్న వ్యాక్సిన్



టీకాలు



పిల్లవాడికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: ప్రాణంతక వ్యాధుల బారిన పడకుండా నవజాత శిశువులు, ఐదేళ్ల లోపు పిల్లలకు వేసే టీకాలపై జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. లబ్ధిదారులందరికీ టీకాలువేసి వ్యాధులు బారిన పడకుండా కాపాడుతోంది. టీకా వేసుకోవడంలో ఏ ఒక్క పిల్లవాడూ తప్పిపోకుండా వైద్య సిబ్బంది జాగ్రత్త వహిస్తూ నిర్దేశిత సమయానికి పిల్లలకు టీకాలు వేస్తున్నారు. వ్యాక్సిన్ కేంద్రాలకు ఆశవర్కర్ల ద్వారా లబ్ధిదారులను రప్పించి టీకాలు వేస్తున్నారు. శిశువుల్లో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. కాబట్టి వ్యాధుల బారిన త్వరగా పడతారు. ఈ నేపథ్యంలో టీకాలు మాత్రమే వారికి రక్షణ ఇస్తాయి. ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కోసం ఐదేళ్ల లోపు పిల్లలకు టీకాలు వేస్తారు. పోలియో, కోరింత దగ్గు, డయేరియా, డిఫ్తీరియా వంటి వ్యాధులు రాకుండా టీకాలు కాపాడతాయి. జిల్లాలో 2023 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు 21,636 మంది ఏడాది లోపు పిల్లలకు టీకాలు వేయాల్సి ఉండగా 21,502 మందికి వేశారు. అలాగే 1నుంచి ఐదేళ్ల లోపు పిల్లలు 21,789 మందికి టీకాలు వేయాల్సి ఉండగా 21,285 మందికి టీకాలు వేశారు.

పిల్లలందరికీ టీకాలు



ప్రతి లబ్ధిదారుకి టీకా వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈమేరకు వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. వైద్య సిబ్బంది కూడా పిల్లలకు వేసే టీకాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. టీకాలు సకాలంలో వేయడం వల్ల పిల్లలు వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోలుగుతున్నాం.

డాక్టర్ ఎస్. భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ